సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం, 30, నవంబర్, 2022




చలి నుంచి రక్షణ భేష్ 8లో

ఆశ్రమాలు, పాఠశాలలో చదువుతున్న 68,275 మంది విద్యార్థులకు 70 వేల రగ్గులను ప్రభుత్వం పంపిణీ చేసింది.



సకాలంలో బియ్యం పంపిణీ

ఏజెన్సీలోని తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో బియ్యం నిత్యావసర వస్తువులు అందజేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. 8లో



రూ.13 లక్షల పెట్రోలు నేలపాలు

గూడెంకొత్తవీధి మండలంలోని చాపగెడ్డ వద్ద మలుపులో పెట్రోలు ట్యాంకర్ బోల్తా పడి, 12వేల లీటర్లు నేల పాలయ్యింది. 8లో

గిరి వాకిట.. సీతాలు శోభ

గిరిజనులు జరుపుకునే పండగలన్నీ దాదాపుగా పూర్వీకుల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలతో ముడిపడి ఉంటాయి. వీటిలో సీతాలు పండగ ఒకటి. వరి పంట చేతికందుతున్న నేపథ్యంలో సిరులు తల్లి ఏటా కరుణించాలని కోరుతూ ధాన్యం రాశుల మధ్య ఈ పండగను నిర్వహిస్తారు. కుటుంబ సమేతంగా బంధువులను ఆహ్వానించి జరుకుంటున్నారు.

- కల్లాల్లో ధాన్యం రాశులకు పూజలు
- ఆశాజనకంగా దిగుబడి
- ప్రతి ఇంటా పండగ సందడి
- పూర్వీకుల ఆచార, వ్యవహారాలను అనుసరిస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: మన్యంలో గిరిజనులు పూర్వీకుల నుంచి ఆచార వ్యవహారాలు పాటించడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో రైతులు పంటలకు చేసే ప్రతి పూజ ప్రత్యేకతను సంతరించుకుని ఉంటుంది. ప్రస్తుతం మన్యంలో సీతాలు పండగ సందడి మొదలైంది. రైతులు ఎంతో కష్టబడి పండించిన పంట చేతికి వచ్చింది. ప్రభుత్వం సైతం రైతులకు ప్రత్యేక రాయితీలు, పెట్టుబడి అందించడంతో రైతుల ఇంట కనుల పంటగా మారింది. రైతులు పండించిన పంటను పొలాలు, కల్లాల్లోను ధాన్యాన్ని రాశులుగా ఏర్పాటుచేసి, సుందరంగా తీర్చిదిద్ది సీతాలు పండగను నిర్వహిస్తున్నారు.

పండగ ఇలా..

వరి నూర్పులు పూర్తయిన తర్వాత వచ్చిన ధాన్యాన్ని కల్లాల్లో పోగుగా పోసి అలంకరిస్తారు. కొంత ధాన్యాన్ని బియ్యంగా మలిచి పరమాన్నం, అన్నంగా వండుతారు. కుటుంబ సభ్యులు, బంధువులు ముఖ్యంగా చిన్నారులను కల్లానికి ఆహ్వానిస్తారు. కుప్పగా పోసిన ధాన్యాన్ని పూలు, మొగ్గలతో సుందరంగా తీర్చిదిద్దుతారు. చేటలు, కోతలకు ఉపయోగించిన కొడవళ్లను ధాన్యం కుప్ప చుట్టూ ఉంచుతారు. కుల దైవాన్ని, దేవతలను తలుచుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. కొత్త బియ్యంతో వండిన అన్నంతో వచ్చిన వారందరికీ భోజనాలు పెడతారు. వచ్చిన వారు కడుపు నిండ తిని రానున్న రోజుల్లో పంటలు బాగా పండాలని దీవిస్తారు. దీనికి తోడు ఇలా అందరిని పిలిచి సీతాలు నిర్వహించడం వల్ల పంట దిగుబడి విషయంలో ఎటువంటి దాపరికం ఉండదని గిరి రైతులు తెలిపారు. ఇలా నిర్వహించడం తమ పూర్వీకుల నుంచి ఆచారమని వారు పేర్కొన్నారు. పంట దిగుడి విషయంలో ఎటువంటి దాపరకం ఉండదని, పంట దిగుబడి తక్కువ ఉన్న రైతులకు పంట బాగా పండిన రైతులు సాయం అందించేందుకు ఆస్కారముంటుందని వారు పేర్కొన్నారు. ఇలా ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు పాటిస్తూ గిరిజనులు వారికి వారే సాటి అని నిరూపిస్తున్నారు.

ఈ ఏడాది పండగ ప్రత్యేకం



ఈ ఏడాది సీతాల పండగ ప్రత్యేకమయింది. పంటకు పెట్టుబడి ప్రభుత్వం అందించడంతో అప్పుల బాధ తప్పింది. పంట దిగుబడి పెరిగింది. రైతులకు ఏమి కావాలో ప్రభుత్వం అందిస్తుండటం సీతాల పండుగ బాగా జరుపుకుంటున్నాం. పూర్వీకుల ఆచార సంప్రదాయాలు పాటిస్తే వారికి విలువిచ్చినవారం అవుతాం. రాబోయే తరాలకు ఆచార వ్యవహారాలు తెలిపినవారమవుతాం.

– వి.రాధమ్మ, మహిళా రైతు, మినుముల పుట్టు, ముంచంగిపుట్టు మండలం



సీతాల పండగ నిర్వహించేందుకు సిద్ధం చేసిన ధాన్యం రాసులు



ధాన్యం రాశికి పూజలు చేస్తున్న గిరిజన రైతులు

ఈ ఏడాది కలిసొచ్చింది



ఏటా పంట కోతలు పూర్తయిన తరువాత కల్లాల్లో ధాన్యం కుప్పగా పోసి సీతాలు పండగ జరుపుకుంటాం. బంధువులు, స్నేహితులను ఆహ్వానించి భోజనాలు పెడతాం. పంట దిగుబడి అందరికి తెలిసేందుకు రానున్న రోజుల్లో పంట బాగా పండేందుకు వచ్చిన వారంతా మనస్ఫూర్తిగా దీవిస్తారు. ఈ ఏడాది పంట దిగుబడి బాగుంది.

– వనుగు రామ్మూర్తి, గిరి రైతు, పాతసుజన కోట, ముంచంగిపుట్టు మండలం

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- ఉధృతంగా చలిగాలులు
- అరకులోయలో 9.5..
- మినుములూరులో 10..
- చింతపల్లిలో 11 డిగ్రీల నమోదు



పాడేరులో ఉదయం తొమ్మిది గంటలకు దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో పాటు, చలిగాలులు విజృంభిస్తున్నాయి. ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 9గంటల వరకు పొగమంచు తీవ్రత నెలకొంది. అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 9.5 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 10డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం నుంచే చలితీవ్రత ఎక్కువగా ఉంటోంది. ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

న్యూస్‌రీల్

ప్రాంతీయ రెవెన్యూ సదస్సు వాయిదా

సాక్షి, విశాఖపట్నం : రెవెన్యూ వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ నెల 30న విశాఖలో జరగాల్సిన రీజనల్ రెవెన్యూ కాన్ఫరెన్స్ వాయిదా పడింది. ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు వివిధ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉండటం వల్ల కాన్ఫరెన్స్‌ను డిసెంబర్ 7వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు డీఆర్వో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాల మేరకు సదస్సుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ఈ సదస్సుకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన కలెక్టర్లు, డీఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం సెషన్‌లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం(రీ సర్వే), ఇళ్ల స్థలాల పంపిణీ, 22ఏ కేసులు, చుక్కల భూముల వ్యవహారాలపైన, మధ్యాహ్నం సాదాబైనామా, అనాదీనం భూములు, ఆర్వోఆర్ యాక్ట్–మ్యుటేషన్స్, ఎస్ఎల్ఏ నిర్వహణ, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, ఓటీసీ–నాలా, ఆక్రమణల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సదస్సు జరగనుందని వెల్లడించారు.

కాఫీ పండ్ల 'మాతోట' ధర రూ.44

సీఈవో వనపల చిన్నారావు



వివరాలు వెల్లడిస్తున్న మాతోట సీఈవో వనపల చిన్నారావు

గూడెంకొత్తవీధి: ఈ ఏడాది స్థానిక మాతోట ఎఫ్‌పీవో(రైతు ఉత్పత్తిదారుల సంఘం) ద్వారా కిలో కాఫీ పండ్లు కిలో రూ.44 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్టు ఆ సంస్థ సీఈవో వనపల చిన్నారావు తెలిపారు. అప్పుడే కోసిన తాజా కాఫీ పండ్లను గిరిజన రైతుల తోటల వద్దకే వాహనంతో వెళ్లి కొనుగోలు చేస్తామని ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న ధరలను అనుసరించి గిరిజన రైతులకు మద్దతు ధర చెల్లిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

'సమగ్ర శిక్షా'లో పలు పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

పాడేరు రూరల్ : సమగ్ర శిక్షాలో జిల్లాలోని పలు విభాగాల్లో పని చేసేందుకు ఆసక్తి గల ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సమగ్ర శిక్షా జిల్లా అదనపు సమన్వయకర్త డాక్టర్ పి. రమేష్ తెలిపారు. సెక్టరల్, అసిస్టెంట్ సెక్టరల్ సీఎంవో, ఏపీవో, ఏఎస్‌వో, ఆసిస్టెంట్ ఐఈ, ఏజీసీడీవో(మహిళలు) విభాగాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వచ్చేనెల ఒకటి నుంచి 5వ తేదీలోగా దరఖాస్తులు స్వీకరింస్తామని ఆయన చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఆసక్తి గల పాఠశాలల హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం సమగ్ర శిక్షా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ధారకొండ వైద్యాధికారిణికి ప్రశంసా పత్రం



సీలేరు: ధారకొండ వైద్యాధికారిణి పీకే హిమబిందు ఉత్తమ సేవా ప్రశంస పత్రం అందుకున్నారు. రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ జె.నివాస్ పోస్టు ద్వారా ఆమెకు పంపించారు. గుమ్మరేవుల గ్రామానికి వెళ్లి తులసి అనే గిరిజన మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ఈ నెల 10వ న ఆమెను వైద్యాధికారిణి పరీక్షించారు. నాలుగు గ్రాముల రక్తం మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. ఆమెను పెద్దల సహకారంతో చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించారు. రక్తహీనత నివారణకు వైద్యాధికారిణి చూపిన చొరవను రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ అభినందిస్తూ ఉత్తమ ప్రశంసా పత్రాన్ని ఆమెకు పంపించారు.

సీజనల్ హాస్టల్ నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ

పాడేరు రూరల్ : వలస వెళ్లిన కుటుంబాల పిల్లల విద్య కొరకు 2022–23 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని జి. మాడుగులలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేస్తున్నామని సమగ్ర శిక్షా అదనపు సమన్వయకర్త డాక్టర్ పి. రమేష్ తెలిపారు. ఈ హాస్టల్ నిర్వాహణకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. వీటిని వచ్చే నెల ఐదు నుంచి 9వ తేదీ లోగా అందజేయాలని కోరారు.

అవగాహనతోనే బాల్య వివాహాల నిర్మూలన

పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్



ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిషేక్

అరకులోయ రూరల్: అవగాహనతోనే బాల్యవివాహాలు నిర్మూలన సాధ్యమని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ అన్నారు. మండలంలో మాడగడ పంచాయతీ కేంద్రంలో మంగళవారం అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు సన్మార్గంలో నడుచుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బందిని ఆయన అభినందించారు, ఈ కార్యక్రమంలో ఎంఈవో భారతీరత్నం, ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్,ఎ న్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, నాగబాబు పాల్గొన్నారు.

పండ్ల తోటల పరిశీలన



పండ్ల తోటలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ భవాని

అనంతగిరి: మండలంలోని ఎన్ఆర్‌పురం పంచాయతీలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పండ్ల తోటలను సీఆర్‌డీ ప్లాంటేషన్ డిప్యూటీ కమిషనర్ భవాని మంగళవారం పరిశీలించారు. పండ్ల తోటల వద్ద గిరిజనులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గతంలో మొక్కలను ఉద్యానవనశాఖ ద్వారా పంపిణీ చేశామన్నారు. వచ్చేఏడాది వర్షాలకు ముందే.. నిమ్మ, సపోట, సీతాఫలం, జామ మొక్కలను గిరిజనులు నేరుగా తెచ్చుకుని నాటుకునేలా చర్యలు చేపడతామన్నారు.అనంతరం జాతీయ ఉపాధి హామీ పథకంలోని భూమి చదును పనులను పరిశీలించారు. ఉపాధికూలీలతో మమేకమయ్యారు. వంద రోజుల పనిదినాలు చాలడం లేదని, 150 పనిదినాలు కల్పించాలని ఉపాధికూలీలు ఆమెకు విన్నవించారు. ఇన్‌చార్జి ఏపీడీ పవన్, టెక్నికల్ టీమ్ కొండనాయక్, సుదీర్, టీఏలు కొండలరావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు 'టేక్‌హోం రేషన్'

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



గర్భిణికి టేక్ హోం రేషన్ అందిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

చింతూరు: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేకంగా టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని తులసిపాక, చూటూరు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా వుంటున్న గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌తో పాటు టేక్ హోం రేషన్‌లో 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, 3 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, పామాయిల్ అందిస్తున్నట్లు తెలిపారు. హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వయసుకు తగ్గట్టుగా ప్రీప్రైమరీ 1,2 పుస్తకాలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. మహిళల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 25 నుంచి వచ్చేనెల 10 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పీడీ తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు హింసకు గురైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో నాడు–నేడు పథకంలో 130 అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లుతెలిపారు. వీటిలో 107 కేంద్రాలకు సంబంధించి ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని, మరో 23 కేంద్రాల పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు ఆమె తెలిపారు. సూపరింటెండెంట్ మూర్తి, సీడీపీవో విజయగౌరి పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు కావాలి

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్



లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: అర్హత ఉన్న యువకులంతా ఓటరుగా నమోదు కావాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సూచించారు. రంపచోడవరంలో మంగళవారం లెనోరా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఓటు నమోదుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాల, లెనోరా ఇంజనీరింగ్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక లెనోరా ఇంజనీరింగ్ కళాశాల నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఫారం –6 నింపి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు.అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఓటరుగా నమోదు కావడంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో లెనోరా కళాశాల కోరా జయరాజ్, డీటీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-అరకు మధ్య వీక్లీ స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): పర్యాటకుల రద్దీ దృష్ట్యా విశాఖ–అరకు మధ్య వీక్లీ స్పెషల్ రైలు నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. విశాఖ–అరకు(08501) స్పెషల్ రైలు విశాఖలో ప్రతీ శని, ఆదివారాలలో ఉదయం 8.30 గంటలకు బయల్దేరి ఉదయం 11.30 గంటలకు అరకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అరకు–విశాఖపట్నం(08502) స్పెషల్ రైలు అరకులో ప్రతీ శని, ఆదివారాలలో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి సాయంత్రం 6గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్ రైళ్లు డిసెంబరు 3వ తేదీ నుంచి జనవరి 22వ తేదీ వరకు నడుస్తుంది. ఈ స్పెషల్ రైళ్లు 5–సెకండ్ క్లాస్, 7–జనరల్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ కమ్ లగేజి కోచ్‌లతో నడుస్తుంది. ఈ రైళ్లు ఇరుమార్గాలలో సింహాచలం, కొత్తవలస, బొర్రాగుహలు స్టేషన్‌లలో ఆగుతాయి.

శ్రీహర్షిత్‌కు అభినందన



మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుభద్ర

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం సందర్శించారు. మండలంలోని జెడ్పీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆమె సమీక్షించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఎంపీడీవో శ్రీహర్షిత్‌కు సూచించారు. గామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించామని, జెడ్పీ నిధులతో మరింత అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. నూతనంగా వెలుగులోకి వచ్చిన చిట్టంపాడు జలపాతం అభివృద్ధితో పాటుగా ఆహో బ్రాండ్ ద్వారా కాఫీ రైతులకు మేలు జరిగేవిధంగా కృషిచేస్తున్న ఎంపీడీవో శ్రీహర్షిత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలోని మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన జల్‌జీవన్ మిషన్ పనులు

- నాణ్యత లోపిస్తే చర్యలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు : జలజీవన్ మిషన్ కింద చేపడుతున్న పనులు త్వరితిగతిన పూర్తి చేసి గిరిజనులకు సకాలంలో రక్షిత తాగునీరు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో పాడేరు డివిజన్ జలజీవన్ మిషన్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంజూరైన 8789 పనుల్లో 1550 పూర్తికాగా మిగతా పనుల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. పాడేరు అసిస్టెంట్ ఇంజినీరు పూర్తి వివరాలతో హాజరుకాకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తదుపరి సమావేశానికి పూర్తి వివరాలతో రావాలని ఆదేశించారు. 1079 పనులకు టెండర్లు పిలవగా 800 వరకు ఖరారు అయిందని, వీటిలో ఒకొక్క కాంట్రాక్టర్‌కు ఐదుకు మించి పనులు అప్పగించవద్దన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. జలజీవన్ మిషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లీలాకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాలకృష్ణ, జయరాం, ఆర్.రాజు, ప్రకాష్, మండల సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర లక్ష్యం

కాఫీ రైతులకు మంచి గిట్టుబాటు ధరలు అందించడమే లక్ష్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. పాడేరు మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన అధికారులు, ఎఫ్‌పీవోలు, లైజన్ వర్కర్లతో కాఫీ ధరలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొలంబడి కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి కాఫీ ధరలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, కాఫీ బోర్డు డీడీ జయంతి ఘోష్, హార్టికల్చర్ డీడీ రమేష్‌కుమార్, కాఫీ ఏడీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు 60 మంది ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డైరెక్టర్

కొయ్యూరు: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు 60 మంది ఎంపికయ్యారు. వీరిలో 20 మంది బాలికలు ఉన్నారు మంగళవారం స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలో వీటిని నిర్వహించారు. విశాఖపట్నం,అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి 225 మంది అండర్ 14,17 విభాగం పోటీల్లో పాల్గొన్నారు. వీటిలో అర్హత సాధించిన 60 మంది వచ్చే నెల చిత్తూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని కుస్తీ అకాడమి ఇన్‌చార్జి అంబటి నూకరాజు తెలిపారు. పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, ఎంపీపీ బడుగు రమేష్ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ఎంపికైన వారంతా పట్టుదలతో ప్రాక్టీస్ చేసి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. అకాడమిని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిస్తే ఒలంపిక్స్‌లో పాల్గొనే అవకాశం కూడా వస్తుందని చెప్పారు. ఇదంతా సాధనతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. సాప్ జిల్లా కోర్డినేటర్ ఎస్ సింహాచలం, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు పి. సింహాచలం, ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, హెచ్‌ఎం మూర్తి పాల్గొన్నారు.

కమనీయం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



పవనగిరి క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న వెంకటరామయ్య, సీఐ రాంబాబు



ఫజుల్లాబాద్‌లో స్వామివారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు



కొయ్యూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి పురస్కరించుకుని జిల్లాలోని అన్ని శివాలయాలు, అయ్యప్ప, విఘ్నేశ్వరస్వామి ఆలయాల్లో కొలువుదీరిన సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరకు ఎల్లమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం డాక్టర్ శ్రీరాములు,అ మూల్య దంపతుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం అనంతరం అన్న సమారాధన ఏర్పాటుచేశారు.

దేవీపట్నం: ఫజుల్లాబాదులోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. తంటికొండ గ్రామానికి చెందిన వారు అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బందోబస్తు ఏర్పాటుచేసినట్టు ఎస్‌ఐ కేవీ నాగార్జున తెలిపారు.

కొయ్యూరు: భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు.అభిషేకాలను నిర్వహించారు.

అడ్డతీగల: సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాన్ని మంగళవారం స్థానిక పవనగిరి క్షేత్రంలో వైభవంగా నిర్వహించారు. క్షేత్ర వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో గణేషశర్మ, ఆయ్యప్పశర్మ శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సీఐ వై.రాంబాబు,రాజమహేంద్రవరానికి చెందిన జ్యోతిష్కుడు జనార్దన స్వామి దంపతులు తదితరులు స్వామివారిక ఫల పుష్పాలు సమర్పించి సేవించారు. అనంతరం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ ఈల పాట, కళాకారుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటుచేశారు.

చలిమంటకు రెండు పూరిళ్లు దగ్ధం


దగ్ధమవుతున్న పూరిళ్లు

రాజవొమ్మంగి : లబ్బర్తిలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ. 2 లక్షలు ఉంటుందని అంచనా. చలి నెగడు నుంచి ఎగసిన నిప్పురవ్వలే ఈ ప్రమాదానికి కారణం అని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో పసగడుగుల సూర్యకుమారి, చినబాబులకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. మోటారుసైకిల్, ధాన్యం తదితర ఆహార దినుసులు, ఫర్నిచర్, విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎండిన పొగాకు బేళ్ళు, వంట సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

డీడీ కొండలరావు

కొయ్యూరు: విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు, హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు సూచించారు. మండలంలోని మంప, కొయ్యూరు గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్య సేవలందించాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న ఏకలవ్య పాఠశాలను మరో చోటుకు తరలించే అవకాశముందని దీనిపై కలెక్టర్, ఐటీడీఏ పీవో నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. అన్ని హాస్టళ్లకు డైట్ బిల్లులు మంజూరవుతాయన్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల మంజూరయ్యాయని, ట్రెజరీలోని పనులు పూర్తికాక కొన్నిచోట్ల నిలిచినట్లు తెలిపారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ మోహన్ తదితరులున్నారు.

గిరి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర


సదస్సుకు హాజరైన రైతులు, వ్యాపారులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్,
- సుగంధ ద్రవ్యాల సాగుపై ప్రత్యేక దృష్టి : జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ట్రైకార్ ఛైర్మన్ బుల్లిబాబు



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, వేదికపై అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

అరకులోయ రూరల్: గిరిజన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. మండలంలోని పద్మాపురం పంచాయతీలో కేంద్ర స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో మిరియాల ఉత్పత్తిదారులు, కొనుగోలుదారులు, విక్రయదారుల సదస్సు మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సుమిత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధర కల్పించి, గిరి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. ప్రధానంగా మన్యంలో పండించే కాఫీ, మిరియాలకు అంతర్జాతీయ మార్కెట్ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సుగంధ ద్రవ్యాల సాగుకు మన్యం అనుకూలం

కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ సుగంధ ద్రవ్యాల సాగుకు మన్య ప్రాంతం అనుకూలమన్నారు. గిరిజన రైతులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోని మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రత్యేక దృష్టి సారిస్తే కేరళకు దీటుగా సుగంధ ద్రవ్యాల దిగుబడి సాధ్యమన్నారు.

రైతులకు మరింత ప్రోత్సాహం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబులు వేరువేరుగా మాట్లాడుతూ మన్యంలో అటవీఉత్పత్తులు, పసుపు, అల్లంతో పాటు కాఫీ, మిరియాలు తదితర పంట సాగుకు రైతులకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. గిరి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే దళారుల వద్ద మోసపోకుండా ఉంటారన్నారు. వారపు సంతల్లో ప్రైవేట్ వ్యాపారులను అరికట్టి వాణిజ్య సంస్థలకు నేరుగా విక్రయిస్తే రైతులకు లాభదాయకమన్నారు. రైతులు సరకులు నిల్వ చేసేకునేందుకు కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. సుగంధ ద్రవ్యాల బోర్డు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జోజి మ్యాథ్యూ, నితిన్‌జోయ్, ఎన్‌సీడీసీ రీజనల్ డైరెక్టర్ వికె దుబాసి, సిబ్బంది కళ్యాణి, సర్పంచ్ సుస్మిత, ఎంపీటీసీ సభ్యురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.

రూ.13 లక్షల పెట్రోలు నేలపాలు


సంఘటన ప్రదేశంలో అగ్నిమాపక శకటం, సిబ్బంది

గూడెంకొత్తవీధి : చాపగెడ్డ వద్ద మలుపులో మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తూ పెట్రోలు ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ట్యాంకర్‌లో ఉన్న 12వేల లీటర్ల పెట్రోలు మొత్తం నేలపాలయ్యింది. దీని విలువ సుమారు రూ.13 లక్షల వరకూ ఉంటుందని అంచనా. విశాఖపట్నం హెచ్‌పీసీఎల్ కంపెనీనుంచీ గూడెంకొత్తవీధి మండలం సీలేరులో ఉన్న జీసీసీ పెట్రోలు బంకుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వాహనం డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు తెలిసింది. చాపగెడ్డ వద్ద మలుపులో వాహనాన్ని నియంత్రించలేక ట్యాంకర్ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదం జరిగిన వెంటనే ట్యాంకర్ నుంచి పెట్రోలు కారిపోతుండడాన్ని గమనించిన స్థానికులు కొందరు సీసాలు, క్యాన్లు పట్టుకుని అందినకాడికి పట్టుకుపోయే ప్రయత్నం చేశారు. ప్రమాద సంఘటన తెలియగానే తహసీల్దారు రాజ్‌కుమార్, సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. నర్సీపట్నం నుంచి అగ్నిమాపక శకటాన్ని రప్పించారు. రహదారి మార్గంలో వాహనాలను నియంత్రించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

తాగి వాహనం నడిపిన ఐదుగురికి జైలు

మరో ఐదుగురికి రూ.10వేల జరిమానా

యలమంచిలి : మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన కేసుల్లో ఐదుగురు వ్యక్తులకు మంగళవారం యలమంచిలి ఎజెఎఫ్‌సిఎమ్ కోర్టు ఒక రోజు జైలు శిక్షను, మరో ఐదుగురు వ్యక్తులకు రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్టు యలమంచిలి ట్రాఫిక్ ఎస్‌ఐ డి.ఈశ్వరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటాయని, ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారు మద్యం సేవించరాదని, హెల్మెట్ విధిగా ధరించి వాహనాలను నడపాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి


అభిచర్ల సమీపంలో అదుపు తప్పి వాగులో పడిన మోటార్‌బైక్, మృతిచెందిన కన్నయ్య

కూనవరం : పొద్దు పోయింది రేపు వెళ్ళవుగాని అని బంధువులు ఎంత బతిమిలాడినా వినకుండా వెళ్లిన వ్యక్తిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబలించిన సంఘటన మండల పరిధిలోని అభిచర్ల గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చిడుమూరు గ్రామానికి చెందిన బొక్కిలి కన్నయ్య(36) కూనవరం మండలం కోతులగుట్ట ఏపీఆర్ గురుకులం కళాశాలలో ఇంటర్ చదువుతున్న తన కూతురిని చూసేందుకు సోమవారం ద్విచక్ర వాహనంపై వచ్చాడు. కూతురుని పరామర్శించి సాయంత్రం తిరిగి వెళ్లుతూ మార్గమధ్యంలో ఉన్న పెదార్కూరు గ్రామంలో బంధువులైన ధర్ముల లక్ష్మణరావు ఇంటికి వెళ్లాడు. బంధువులతో మటామంతి అయ్యాక అక్కడి నుంచి చిడుమూరు బయలుదేరగా బాగా పొద్దుపోయింది వెళ్లొద్దు... ఉదయమే వెళ్ళవుగాని ఎంత బతిమిలాడినా వినకుండా బయలుదేరి వెళ్లాడు. అభిచర్ల గ్రామం వద్ద మోటార్‌బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొని వాగులోకి దూసుకు పోయింది. ఘటనలో కన్నయ్యకు బలమైన దెబ్బలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేష్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు


నిందితుడితో సీఐ రమేష్

చింతపల్లిరూరల్ : మండలంలోని లోతుగెడ్డలో ఓ వ్యక్తిని కోడి కత్తితో దాడి చేసి హతమార్చిన నిందితుడిని మంగళవారం అరెస్టు చేశామని సీఐ రమేష్ తెలిపారు. గత శుక్రవారం లోతుగెడ్డకి చెందిన సరమండ దిలీప్‌కుమార్ అదే గ్రామానికి చేందిన శ్రీనివాసరావును కోడి కత్తితో దాడి చేసి హతమార్చిన సంగతి తెలిసిందే. హత్యకు గల కారణాలను సీఐ వెల్లడించారు. దిలీప్‌కుమార్ తన స్నేహితుడు లోవరాజుతో కలసి సారా తాగడానికి శ్రీనివాసరావు ఇంటికి వెళ్లాడు. మద్యం మత్తులో అతనితో దిలీప్‌కుమార్ గొడవకు దిగాడు. వివాదం ముదరడంతో గ్రామస్తులు ఇద్దరిని విడదీశారు. అయితే శ్రీనివాసరావును చంపేస్తానంటూ దిలీప్‌కుమార్ హెచ్చరిస్తూ వెళ్లాడు. కొంతసేపటికి శ్రీనివాసరావు మేనల్లుడు పారేపల్లి రోహిత్‌ను చంపాలని కోడికత్తి తీసుకుని రోహిత్ ఇంటికి వెళ్లాడు. పెంపుడు కుక్క అరవడంతో తిరుగుముఖం పట్టిన దిలీప్‌కుమార్ ఒక కిరాణా షాపు వద్ద వేచి వున్న శ్రీనివాసరావును ఎడమ ఛాతీ, పొట్టపై బలంగా పొడిచి అక్కడ నుంచి పరారయ్యాడు. మంగళవారం లోతుగుడ్డ వీఆర్‌వో వద్దకు వచ్చి జరిగిన విషయం చెప్పి లొంగిపోయాడు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో అన్నవరం, చింతపల్లి ఎస్‌ఐలు సాయికుమార్, షరిఫ్ ఆలీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాన శిబిరం కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డి.రవికుమార్ పర్యవేక్షణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (పాడేరు) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆపదలో అవసరమైన వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. విద్యార్థులు సేవా దృక్పథంతో ఉండాలన్నారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో చురుకగా పాల్గొనాలని, మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కష్టపడి, ఇష్టపడి చదవాలన్నారు. రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు, కార్యదర్శి ఈశ్వరరావు, కో–ఆర్డినేటర్ కోటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో బియ్యం పంపిణీ

రంపపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ఏజెన్సీలోని తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో బియ్యం నిత్యావసర వస్తువులు అందజేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం ఏడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జీసీసీ మేనేజర్లు, సివిల్ సప్లయి అధికారి ఆర్.శివప్రసాద్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డుదారులకు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 22 వరకు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరఫరా చేయాలని, లేని పక్షంలో సంబంధిత అధికారులు , సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఏజెన్సీ ఏడు మండలాల పరిధిలో తెల్లరేషన్ కార్డులకు 9,57,645 కేజీల బియ్యం ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి నెల నిత్యావసర వస్తువుల సరఫరా చేసే బాధ్యత తహసీల్దార్లు,వీఆర్వోలు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, గ్రామసచివాలయ వలంటీర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సంబంధిత అధికారులతో సిబ్బందితో తహసీల్దార్లు సమావేశం ఏర్పాటు చేసుకుని నివేదికలు ఇవ్వాలన్నారు ఎండీయయు వాహనంపై టోల్‌ఫ్రీ నంబర్ రాయించాలని తెలిపారు. జిల్లా సివిల్ సప్లయి అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రేషన్ షాపులో మూడో వారం సరుకుల కోసం డీడీ సమర్పించాలన్నారు. ఎండీయూ వాహనాలు ట్రాక్ ద్వారా ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు.

సమావేశంలో డివిజనల్ సివిల్ సప్లయి అధికారి శ్రీహరి, జీసీసీ డీఎం పార్వతీశం, సీనియర్ మేనేజర్ ఎం రాజారెడ్డి, తసీల్దార్లు వెంకటేశ్వరరావు, సుబ్రమణ్యం, బి రాజు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై కళాశాల యువతకు శిక్షణ


యువత ఓటర్ నమోదుపై కళాశాలల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం

తుమ్మపాల: భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని డీఆర్వో పి.వెంకటరమణ పిలుపునిచ్చారు. యువత ఓటరు నమోదుపై వివిధ కళాశాలల ప్రతినిధులతో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఫారం–6 సమర్పించుటకు నిర్దేశించిన ఆన్‌లైన్ యాప్, ఆఫ్‌లైన్ పద్ధతులపై అవగాహన కల్పించారు. డిసెంబర్ 8లోగా 18 సంవత్సరాలు పూర్తయిన విద్యార్థులంతా తమ ఓటును నమోదు చేసుకునే విధంగా వారిలో అవగాహన పెంచాలన్నారు. ప్రతి కళాశాల నుంచి ఒక ఉద్యోగి కళాశాల నోడల్ అధికారిగాను, విద్యార్థుల్లో ఒకరిని క్యాంపస్ అంబాసిడర్‌గా నియమించి ఓటరు నమోదుపై యువతలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఫారం–6 దరఖాస్తులను www.nvsp.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోను, ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్ యాప్ ద్వారా గానీ, వ్యక్తిగతంగా అయితే సంబంధిత తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయంలో సమర్పించవచ్చన్నారు. ఎన్నికల సంఘం ఇటీవల చేసిన సవరణల ప్రకారం అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్ల వయస్సు నిండుతున్న యువత కూడా ముందస్తుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


బహుమతులు అందజేస్తున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ చెప్పారు. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆరు జట్లు పాల్గొనగా డిగ్రీ కాలేజీ విద్యార్థులు విన్నర్స్‌గా, సీఆర్‌పీఎఫ్ పోలీసులు రన్నర్స్‌గా నిలిచారు. వీరికి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ క్రీడా కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు ఆడడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఇన్‌స్పెక్టర్లు జీవన్ కుమార్, వీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వేచలం విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం నర్సింహమూర్తి, సర్పంచ్, ఎంపీటీసీ

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వేచలం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. విశాఖ ఆంధ్ర యూనివర్సిటీలో ఈ నెల 22న ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో 11 విభాగాల్లో సత్తా చాటారు. అండర్–14 బాలుర విభాగంలో డి. గణేష్ 100, 200 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్‌లోను, కె. సాయికార్తికేయ 80 మీటర్ల హడిల్స్‌లోను, టి. శివశంకర్ 5 వేల మీటర్ల నడకలోను ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్–14 బాలికల విభాగంలో బి. చైతన్య లాంగ్‌జంప్‌లోను, వి. ప్రవల్లిక హైజంప్‌లోను, ఎస్.రమ్య 200, 400 మీటర్ల రన్నింగ్, 80 మీటర్ల హడిల్స్‌లోను, కె. సౌజన్య 600 మీటర్ల రన్నింగ్‌లోను ప్రథమ స్థానాల్లో నిలిచారు. సిహెచ్. మధు 600 మీటర్ల రన్నింగ్, వి. హరిప్రసాద్ 400 మీటర్ల హడల్స్‌లోను తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరంతా శ్రీకాకుళం జిల్లాలో వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం డి. నర్సింహమూర్తి తెలిపారు. వీరితోపాటు పీడీ ఆర్. తమ్మునాయుడును స్థానిక హైస్కూల్‌లో మంగళవారం సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు రెడ్డి శ్రీనివాసు, వేచలపు పరమేష్, రెడ్డి బలరాం అభినందించారు.

చలి నుంచి రక్షణ భేష్

- ఏజెన్సీలో ఆశ్రమ విద్యార్థులకు పూర్తి స్థాయిలో రగ్గులు
- పంపిణీ చేసిన ప్రభుత్వం

జిల్లా వివరాలు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు: 203
గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు: 22
విద్యార్థుల (3 నుంచి టెన్త్) సంఖ్య: 68,275
పంపిణీ చేసిన రగ్గులు: 70 వేలు


ముంచంగిపుట్టు ఆశ్రమ బాలుర పాఠశాల–1లో రగ్గులు కప్పుకుని పడుకున్న విద్యార్థులు

ముంచంగిపుట్టు: మన్యంలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు చలి నుంచి రక్షణ కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం జిల్లాలోని ఐటీడీఏల పరిధిలో విస్తృతంగా, శరవేగంగా రగ్గుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో విద్యార్థుల చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఆశ్రమాల్లో చదువుతున్న విద్యార్థుల్లో చాలా మంది ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రగ్గుల పంపిణీ గిరిజన విద్యార్థుల్లో ఎంతో ఆనందం నింపింది.

హాయిగా నిద్రపోతున్నాం



ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉంది. ప్రభుత్వం అందించిన రగ్గులతో చలి నుంచి ఉపశమనం లభిస్తోంది. పాఠశాలలో విద్యార్థికి ఒక్కొక్కటి చొప్పున అందించారు. రగ్గులు నాణ్యతగా ఉన్నాయి. దీంతో రాత్రి వేళల్లో హాయిగా నిద్రపోగలుగుతున్నాం.

– సీసా కొండలరావు, విద్యార్థి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–1, ముంచంగిపుట్టు

పంపిణీ పూర్తి



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రగ్గుల పంపిణీ వేగంగా పూర్తి చేశాం. మా పరిధిలో 36,124 రగ్గులు అందజేశాం. విద్యార్థులకు ఏ ఆశ్రమ పాఠశాలలో అయినా రగ్గులు అందలేదని ఫిర్యాదు వస్తే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం.

– ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకులు, పాడేరు ఐటీడీఏ